ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 16 సెప్టెంబరు, 2025 | పేజీలు :08

## ప్రజావాణిలో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి జరుగుతున్న నేపథ్యంలో కొడుకు కోడలు సరిగా చూసుకోవడం లేదని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రుద్రంగి మండలం అజ్మీర తండాకు చెందిన విటల్ అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. అక్కడున్న అధికారులు అప్రమత్తమై సరైన సమయంలో చాకచక్యంగా వ్యవహరించి ఆయన చేతిలోని డబ్బాను లాక్కొని ప్రభుత్వ వాహనంలో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆయనకు ప్రాణాపాయం లేదని, ప్రాణాపాయం నుండి కోలుకుంటున్నాడని సమాచారం.

## రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక
# లేకపోవడం వల్లే యూరియా కొరత

ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రానికి యూరియా కొరత ఏర్పడిందని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లో ఇంజనీరింగ్ కాలేజిలకు గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల నుండి ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందన్నారు. తెలంగాణలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. దేశంలో ఉన్న విద్యార్థులకు, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం చాలా నష్టం జరుగుతుందన్నారు. కామారెడ్డి బీసి డిక్లరేషన్‌లో బీసి విద్యార్థులకు వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి పాత విధంగా కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రూప్ 1అవకతవకలు చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. పాత నోటిఫికేషన్ ఉద్యోగులు ఇస్తున్నారు. కొత్త నోటిఫికేషన్లు లేవని, ఔట్ సోర్సింగ్, గెస్ట్ లెక్చరర్స్‌కు గత ఎనిమిది నెలల నుండి జీతాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ పెయింటర్లపై చర్యలు తీసుకోవాలని
# ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/బైంసా:** నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఇతర రాష్ట్రాల పెయింటర్లపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పెయింటర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.ఈ రోజు పట్టణంలో పెయింటర్ యూనియన్ కార్యాలయం నుండి డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి డిప్యూటీ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పెయింటర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ,బైంసా పట్టణంలో వందల సంఖ్యలో ఇతర రాష్ట్రాల పెయింటర్లు వచ్చి స్థానిక యూనియన్‌లో సభ్యత్వం తీసుకోకుండా చట్ట విరుద్ధంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు.దీనివల్ల స్థానిక పెయింటర్లును పిలిపించి సమావేశం ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ వినతిపై స్పందించిన డిప్యూటీ కలెక్టర్ తక్షణమే ఎమ్మార్వో లేబర్ ఆఫీసర్,ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సమక్షంలో ఒక వారం లోపల సమావేశంలో ఒక వారం లోపల సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్,ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్,సీపీఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ తో పాటు పెయింటర్ యూనియన్ నాయకులు గోపి,లతీఫ్,సి.హెచ్.లక్ష్మ ణ్,అనిల్ సింగ్,జావేద్,పరుశురామ్,అంబాదస్,సత్యనారాయణ,ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఫోటో ఎక్స్
# పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఈ నెల 19–20–21 తేదీలలో తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో జరిగే ట్రేడ్ ఎక్స్ పో వాల్ పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి ముత్యాల ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఎండీ అజుమోద్దీన్ మాట్లాడుతూ ఫోటో ట్రేడ్ ఎక్స్‌ఫో గ్రామీణ ప్రాంత ఫోటో వీడియో గ్రాఫర్స్‌కు వృత్తి నైపుణ్యాన్ని పెంపోందించుకోవటానికి, కొత్త టెక్నాలజీ తో పాటు న్యూ మోడల్ కెమెరాల, ప్రింటర్స్ వంటి నూతన సాంకేతికతను నేర్చుకోవాడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఫోటో గ్రాఫర్ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పెంజర్ల తిరుపతి యాదవ్, మహమ్మద్ షాదుల్, మారోజు కుబేర స్వామి, శాద చంద్రశేఖర్ రెడ్డి, మరోజు నరసింహచారి, బసవపురం కృష్ణ, వేముల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ప్రజాపక్షం/కరీంనగర్: రాష్ట్రంలో యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలిపోతుంటే.. అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కరీంనగర్ లో సోమవారం ఆధునీకరించిన పాస్ పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ రబీలో రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం కెటాయించిందని, రాష్ట్ర ప్రభుత్వం అంచనా ప్రకారం రబీలో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అవసరముండగా మిగతా 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఏమైందనేది రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలన్నారు. రైతులకు అందాల్సిన యూరియా పక్క దారి పడుతదని, దానిని అరికట్టకుండా కేంద్రాన్ని విమర్శించడమేంటని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడ్డ 11 సంవత్సరాల్లో రాని కొరత ఈ యేడాది ఎందుకు వచ్చిందనేది ఆలోచించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యను తొందరగా పరిష్కరించాలని అన్నారు.

**ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయండి**

రాష్ట్రంలో పెండింగ్ ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ఈ ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం, ఫీజు రియంబర్స్ మెంట్ అడుగుతున్న యాజమాన్యాలను బెదిరింపులకు గురిచేయడం తగదన్నారు.ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 8 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.కేటీఆర్ పరువు నష్టం దావా వేసి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని, న్యాయ పరంగా ఎదుర్కొంటానని అన్నారు. తొమ్మిది సార్లు జైలుకెళ్లి వచ్చానని,తనపై వందకు పైగా కేసులున్నాయన్నారు. పరువు నష్టం కేసులు వేయాలంటే కేటీఆర్, కేసీఆర్ లపై అనేక కేసులు వేయవచ్చని అన్నారు. రాజకీయంగా ఎదుర్కొంటాను తప్ప ఇజ్జత్ దావాలు వేయనన్నారు.

## ఆశా వర్కర్ నియమించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి గ్రామానికి ఆరు సంవత్సరాలుగా ఆశా వర్కర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆశా వర్కర్‌ను నియమించాలని కోరుతూ ఆదివారం గాండ్ల లక్ష్మి నారాయణతో పాటు పలువురు గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఆరు సంవత్సరాలుగా గ్రామంలో చిన్నపిల్లలకు, బాలింతలకు ఆరోగ్య సమస్యలను నమోదు చేసి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి వైద్యం అందించే ఆశా కార్యకర్త లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామంలో అర్హులైన వారిని ఆశ వర్కర్‌గా నియమించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో శ్రీనివాస్, సంపత్, స్వప్న, కొమురయ్య తదితరులున్నారు.

## ఘనంగా దారం శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టిఎన్‌జివోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని సంఘ భవనంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో టిఎన్‌జివోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌తో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జిల్లా నాయకులు, గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత బలంగా ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తారని ఆకాంక్షించారు. నాయకులు మడిపల్లి కాళిచరణ్ గౌడ్, అరవింద్ రెడ్డి, నాగుల నరసింహ స్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్, నరేందర్, హరికృష్ణ, రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, వెలిచాల సుమంత్‌రావు, వాస్తవిక్ గౌడ్, కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, ఇరుమల్ల శారద, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి తదితరులున్నారు.

## పింఛన్ల పెంపు కోసం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

ప్రజాపక్షం/చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆసరా పెన్షన్లు పెంపు అమలు చేయడం లేదని సోమవారం మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చొప్పదండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పెన్షన్‌దారులు ముట్టడించారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వెల్మ బాపురెడ్డి, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇంచార్జి తడగొండ శంకర్‌లు మాట్లాడుతూ వికలాంగులకు ఇస్తున్న 4 వేల పింఛన్‌ను 6 వేలు ఇస్తామని, వృద్ధులు, వితంతువులు , ఒంటరి, నేత, గీత తదితర పింఛన్లను 2 వేల నుంచి 4 వేలకు పెంచి ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తమకు ఐదు శాతం అమలు చేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి అసెంబ్లీ వరకు రాజకీయ రిజర్వేషన్ ఇవ్వాల్సిందిగా కోరారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగులు, ఆసరా పెన్షన్‌దారులు, విహెచ్‌పిఎస్ మండల నాయకులు కంది మల్లయ్య, మండల మహా మహిళ నాయకురాలు పుల్లకోల లత, ఎంఎస్‌పి మండల అధ్యక్షుడు దేవదాస్, మహిళా నాయకురాలు గజ్జల రాజేశ్వరి తదితరులున్నారు.

## 17 నుంచి వచ్చే నెల 16 వరకు పోషణ మాసోత్సవాలు

ప్రజాపక్షం/కరీంనగర్: జిల్లాలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు.గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, పోషణ పర్యవేక్షణపై గ్రామస్థాయిలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు తూచడం, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పోషకాహారం ప్రాధాన్యత వివరించడం, మగవారికి వంటల పోటీలు నిర్వహించడం, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జడ్పి సిఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులున్నారు.

**ప్రజావాణి ధరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యత- కలెక్టర్ పమేలా సత్పతి**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి వేగంతంగా పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులతో పలు అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. 2021 ఫిబ్రవరి నుంచి 27 వేల 580 ధరఖాస్తులు రాగా 1810 ధరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమేష్ బాబు తదితరులున్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి



ప్రజాపక్షం/గొల్లపల్లి : సెప్టెంబర్ 17రోజున భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75 జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 25న డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి అక్టోబర్ 2 గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వరకు పదిహేను రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ,జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు చెవులమద్ది శేఖర్ ఆధ్వర్యంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షులు కట్ట మహేష్ మాట్లాడుతూ పదకొండున్నర ఏళ్ల నరేంద్ర మోదీ పాలన ఒక స్వర్ణయుగమని ప్రధానమంత్రితో సహా ఏ ఒక్క మంత్రిపై అవినీతి ఆరోపణలు లేవని పొరుగు దేశాలు సైతం నరేంద్ర మోదీ లాంటి ఆదర్శ పాలన కావాలని కొనియాడుతున్నారని అన్నారు. ఈసమావేశంలో సీనియర్ నాయకులు సింహాచలం సత్యనారాయణ ఉపాధ్యక్షులు కట్ట క్రాంతి ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్. స్వామి, టౌన్ అధ్యక్షులు సంగం కళ్యాణ్ ,దళిత మోర్చా అధ్యక్షులు జగదీష్, సిద్ధుల రాజేశం, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైయిమరీ స్కూళ్లు రద్దు చేయాలి



ప్రజాపక్షం / ధర్మపురి : ప్రి ప్రయిమరీ స్కూళ్లను రద్దు చేయాలని ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా సిఐటియూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సుమారు గంటకు పైగా క్యాంప్ కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రాష్ట్రం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రి ప్రయిమరీ స్కూల్స్ రద్దు చేయాలని వాటి అంగన్వాడీ స్కూల్ లేకుండా పోతాయని మేము ఎన్నో సంవత్సరాల నుండి పిల్లలకు పోష్టికాహారం అందిస్తూ బోధన చేస్తున్నామని తెలిపారు. ప్రి ప్రయిమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలి. ఫేస్ రికగ్నైస్‌ను రద్దు చేయాలి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టినట్లు రూ.లు 18వేలు వేతనం, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలి, రిటైర్ మెంట్ జి.వో నెం.8 సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, 24 రోజుల సమ్మె వేతనం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చింది. ఇంతటి ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనికి భిన్నంగా ఐసిడిఎస్ ను మొత్తం నిర్వీర్యం చేస్తుంది. ఇందులో భాగంగా ప్రీ ప్రయిమరీ, పిఎం, శ్రీ విద్య పేరుతో 5సంవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖను అప్పగిస్తూ నిర్ణయం చేసింది. విద్యా బోధనా బాధ్యతను అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఇవ్వాలి. అదనపు వేతనం చెల్లించాలి. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు రజిత, సిఐటియూ జిల్లా నాయకురాలు స్వప్న, సులోచన, చంద్రయ్య, జయప్రద, సత్యమ్మ, జ్యోతి, లక్ష్మి , గంగా జమున తదితరులు ఉన్నారు.

## గంట చక్రపాణికి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శ

ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఘంట చక్రపాణి సోదరుడు ఘంట అశోక్ సత్యనారాయణ ఇటీవల మృతిచెందగా సోమవారం కరీంనగర్ విద్యారణ్యపురిలో వారి నివాసానికి కాంగ్రెస్ కరీంనగ్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘంటా అశోక్ సత్యనారాయణ చిత్రపటం వద్ద రాజేందర్‌రావు నివాళులర్పించారు. అశోక్ సత్యనారాయణ మృతిపై ఘంట చక్రపాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజేందర్‌రావు వెంట గంట కళ్యాణి, శ్రీనివాస్ తదితరులున్నారు.

## పార్థివదేహానికి నివాళులర్పించిన ఈటల రాజేందర్

ప్రజాపక్షం/వీణవంక: వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన బిజెపి మైనారిటీ నాయకుడు అబ్దుల్ అఖిల్ పాషా మరణించగా వారి నివాసంలో మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ పార్థివదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

ప్రజాపక్షం/కొత్తపల్లి: బొమ్మకల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకల ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లను సన్మానించారు. పంచాయతీరాజ్ కరీంనగర్ డిఈఈ ఈసరి జనార్దన్, పంచాయతీరాజ్ మెట్టుపల్లి డిఈఈ బండ రమణారెడ్డి, మానకొండూర్ డీఈఈ కర్ని రవి ప్రసాద్, పంచాయితీరాజ్ రిటైర్డ్ డిఈఈ బొమ్మరాతి వెంకన్న, ప్రముఖ ఇంజనీర్ కోల అన్నారెడ్డిలను ఘనంగా సన్మానించారు. బొమ్మకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బబ్బు రాజేందర్, క్లబ్ చాటర్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నాయకులు పురుమల్ల శ్రీనివాస్, చింతల కిషన్ పటేల్, కామిరెడ్డి నరసింహారెడ్డి, మాసినేని చక్రధర్, క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

## పురుగుల మందు తాగి ఒకరు మృతి

ప్రజాపక్షం/కొత్తపల్లి: పురుగుల మందు తాగి ఒకరు మృతి చెందిన సంఘటన కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. కొత్తపల్లి సిఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామానికి చెందిన నాగం బ ఈరయ్య (50) ప్రస్తుతం రేకుర్తి గ్రామంలో ఉంటున్నారు. బీరయ్య గత కొంత కాలంలో మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కోటేశ్వర్ చెప్పారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/వీణవంక: పేద ప్రజల ఆరోగ్య భద్రతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన దేవేందర్‌కు రూ.24 వేలు, రెడ్డి కర్ర భగవాన్‌రెడ్డికి రూ.58500, అన్నపూర్ణకు రూ.44500 లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను అందజేశారు.

# పింఛన్లు పెంచాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** వికలాంగులకు పింఛన్లు రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంఆర్‌పిఎస్ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. వృద్ధులు, వితంతువులు, మహిళలలు, గీత , బీడి కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారులకు రూ.4 వేల పెన్షన్ పెంచాలని, ఇప్పటికే నూతన పెన్షన్ కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలన్నారు. 22 నెలలు గడిచినా అధికారంలో ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. నిస్సహాయ స్థితిలో వికలాంగులు, వృద్ధులు, వితంతువుల దుస్థితి ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## భీమేశ్వరాలయంలో దర్శన సౌకర్యాలు పరిశీలించిన ఇఒ రమాదేవి

**ప్రజా పక్షం/ వేములవాడ :** శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ అభివృద్ధికి నోచుకుంటున్న తరుణం లో భక్తులకు కు అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో దర్శన సౌకర్యం అందించాలనేసంకల్పంతో సాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయం, విఐపి రోడ్డు, భీమేశ్వర సదన్, శంకర మఠం, వేద పాఠశాల వంటి పలు ప్రదేశాలను సందర్శించి పనుల పురోగతి గురించి ఆరా తీశారు. ఆమె వెంటఆలయ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది మరియు ఆలయ ఉద్యోగులు ఉన్నారు.

## విశ్వకర్మ బ్రహ్మోత్సవాలలో సామూహిక విశ్వకర్మ వ్రతం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని గాయత్రి మాత సంఘ భవనంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ విశ్వకర్మ భగవానుని పంచాహ్నిక యజ్ఞ మహోత్సవాల లో భాగంగా సోమవారం త్వష్టబ్రహ్మ పూజ , మంటప పూ జలో విశ్వబ్రాహ్మణ పురోహితులు గుగ్గిళ్ళ పు రుషోతమాచార్యులు, శ్రీపెల్లి బ్రహ్మాచార్యులు ఎదులాపురం భాస్కరాచార్యులు, రేవెల్లి తిరుపతి ఆచార్యులు, కట్ట సత్యనారాయణ ఆచార్యులు, కొత్తపల్లి తిరుపతి ఆచార్యుల, ఆధ్వర్యం లో సాముహిక విశ్వకర్మ వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు విశ్వకర్మ సూక్తం తో పాటు మహదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ నాయకులు స్థానిక రాజకీయ నాయకులు ప్రజలు కుల మత వర్గ వర్ణ జాతి భేదం లేకుండా అధిక సంఖ్యలో విశ్వకర్మ భగవానుని ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అద్యక్షులు బ లభక్తుల కిషన్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పోలుకల రాజ గణేష్, కరుణాకర్, కార్యవర్గ స భ్యులు పట్టణ విశ్వబ్రాహ్మణ యువజన సంఘం సభ్యులు, మహిళలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

## జీవన్‌రెడ్డికి దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవ ఆహ్వానం

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్‌రెడ్డి నవదుర్గ సేవా సమితి జగిత్యాల వారి ఆధ్వర్యంలో గోవింద్‌పల్లి నవదుర్గ పీఠ క్షేత్రం దుర్గ శరన్నరాత్రి ఉత్సవ ఆహ్వానం పత్రికను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి నవదుర్గ సేవ సమితి సభ్యులు అందజేశారు.

## రాజన్న ఆలయంలో భద్రత, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ ఆలయానికి వచ్చే భక్తుల భద్రతకు పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆలయ ప్రాంగణంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాన్ని పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆలయాల అధికారులను ఆదేశించారు.ఆలయ ప్రాంగణం,గోపుర ద్వారాలు, క్యూలైన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వీధులలో సీసీ కెమెరాలను విస్తృతంగా అమర్చాలన్నారు.భక్తులు క్యూలైన్‌లలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తూ నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ప్రధాన రహదారుల్లో డైవర్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు.పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బంది నియమించి, వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో వేములవాడ ఏ ఎస్ పి శేషాద్రి రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అదునపు ఎస్పీ చంద్రయ్య, ఆలయ ఈవో ఎల్ రమాదేవి, ఆలయ ఉద్యోగులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్ధార్ కార్యాలయాన్ని పెన్షన్ దారులు ముట్టడి



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెవులమద్ది రమేష్ మాదిగ ఆధ్వర్యంలో వికలాంగులు ,వృద్ధులు , వితంతువులు ,ఒంటరి మహిళలు ,బీడీ కార్మికులు,నూతన పెన్షన్ దారులతో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు . ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగులు ,వృద్ధులు ,వితంతువులు ,ఒంటరి మహిళలు ,బీడీ కార్మికులు చాలా దుర్భరమైన జీవితం గడుపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులతో ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచి నూతన పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొకే నాపెల్లి సతీష్ పాల్గొన్నారు . తదుపరి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగులకు 6000 ,వితంతువులకు ,వృద్ధులకు ,ఒంటరి మహిళలకు ,చేనేత కార్మికులకు ,బీడీ కార్మికులకు ,గీత కార్మికులకు 4000 రూపాయల పెన్షన్ పెంచుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టో లో పెట్టారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు పెన్షన్లు పెంచలేదని ఇకనైనా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేకుంటే మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బలే తిరుపతి ,చిర్ర మల్లేష్ ,ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మ్యాక స్వామి, మల్లయ్య, లింగయ్య, నర్సయ్య, రమేష్ రమేష్ వికలాంగులు వితంతువులు వృద్ధులు పాల్గొన్నారు.

## ఒకినావా స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారుల ప్రతిభ



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** కరీంనగర్ పట్టణంలోని రేకుర్తిలోనే సాయి మహాలక్ష్మి గార్డెన్లో షూటో రాయ్ కరాటే ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియా ఓపెన్ ఛాంపియన్షిప్ 2025 కరాటే పోటీల్లో వేములవాడ ఒకినావ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వేములవాడ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో మొత్తం 60 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటగా, వారిలో పలువురు బంగారు, వెండి, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. మొత్తం 25 బంగారు, 18 వెండి, 12 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే స్పారింగ్ విభాగంలో ఉప్పల పవన్ రాజ్ గ్రాండ్ చాంపియన్షిప్ కప్ను గెలుచుకున్నారు. సాధించారు ఈ సందర్భంగా జిల్లా ఒకినావ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, సీనియర్ మాస్టర్ అబ్దుల్ మన్నాన్ మాట్లాడుతూ తమ అకాడమీ విద్యార్థులు సౌత్ ఇండియా కరాటే పోటీ లో తమ కృషితో మంచి ప్రతిభను చూపించారని, ఇది ఎంతో గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఒ కి నా వా స్పోర్ట్స్ అకాడమీ ఇన్స్ట్రక్టర్లు ఎం. తిరుపతి, అర్జున్ సింగ్, సిహెచ్ సూర్య జయచంద్ర ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్ధార్ కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు గద్దరాశి భగవంతం ఆధ్యర్యంలో పెన్షన్ దారులకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్ధార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎంఆర్వో ముక్తార్ పాషాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ వికలాంగులకు, వితంతువులకు, బీడీ కార్మికులకు, అన్ని రకాల పెన్షన్ దారులకు పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామిని ప్రభుత్వం మర్చిపోయిందని, వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోగూరి రమేష్, లక్ష్మ న్, రవి, తిరుపతి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు టై బెల్ట్‌ల వితరణ



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు అంబటి విజయ్ జన్మదినం పురస్కరించుకొని కేటీఆర్ మొదలు పెట్టిన గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మండలంలోని గొల్లపల్లి అంబేద్కర్‌నగర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు టై బెల్ట్‌తో పాటు ఐడి కార్డులు అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం నాయకులు చందనం శివరామకృష్ణ, అందె సురేష్, మనోజ్, అరుణ్, అందె బాబు, ప్రశాంత్, దేవచంద్రం, ఈశ్వర్, సత్యనారాయన, ప్రణయ్ పాల్గొన్నారు.

## ఎంఆర్ఒ కార్యాలయాన్ని ముట్టడించిన ఎంఆర్‌పిఎస్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత గీత, బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారులకు రూ 4000 పెన్షన్ పెంచాలని ఎల్లారెడ్డిపేట మండల తహసీల్ధార్ సుజాతకు ఎంఆర్పీఎస్ నాయకుడు కానపురం లక్ష్మ ణ్ సోమవారం వినతి పత్రం అందించారు. సోమవారం వృద్దులతో కలిసి ప్రజావాణిలో అర్జీలను ఇచ్చారు. ఇప్పటికే నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. వెంటనే వారికి పింఛన్లు అందజేయాలని కోరారు. ప్రభుత్వం మెనిఫెస్టోలో వాగ్ధానం చేసిన ప్రకారం పింఛన్లు అందించడం లేదని, అర్హులైన వారికి కూడా పింఛన్లు అందడంలేదని, దీనికి తోడు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, వెంటనే ప్రభుత్వం వారి పరిస్థితిని మానవత్వంతో అర్థం చేసుకోవాలని ఎంఆర్పీస్ నాయకులు డిమాండ్ చేశారు.

## 17వ తేదీన ప్రజా పాలన దినోత్సవం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈ నెల 17వ తేదీన బుధవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని మైదానంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముందుగా పోలీస్ ల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇంజనీర్స్ డే సందర్భంగా రాజన్న ఆలయ సిబ్బందికి సత్కారం

**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఇంజనీర్స్ డే సందర్భంగా రాజన్న ఆలయ ఇంజనీరింగ్‌సిబ్బందిని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొని ఇంజనీరింగ్ సిబ్బందిని అభినందించారు.

# ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పాలన హిట్లర్ పాలనను తలపిస్తోంది

ప్రజాపక్షం/పెద్దపల్లి: రామగుండం ఎంఎల్ఎ మక్కాన్ సింగ్ నియంతలా వ్యవహరిస్తున్నారని, ఆయన పాలన హిట్లర్ పాలనను గుర్తు చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ కోరుకంటి చందర్ ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, కూల్చివేతలు చేపట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన బంద్‌ను విఫలం చేసేందుకు లక్ష్మీ నగర్‌లోని వ్యాపారులను ఎంఎల్ఎ బెదిరించారని చందర్ మండిపడ్డారు. బంద్‌లో పాల్గొంటే మరో ఐదు భవనాలను కూల్చివేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. రోడ్డు వెడల్పు పేరిట చిరు వ్యాపారుల దుకాణాలను ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేసి, వారి జీవితాలను రోడ్డుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా రోడ్డు వెడల్పు ప్రణాళికలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఎంఎల్ఎకు ఉందని అన్నారు. గాంధీ నగర్, లక్ష్మీ నగర్, ఎన్‌టిపిసిలో కూల్చివేతలకు గురైన దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించాలని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



రామగుండంలో హిట్లర్ తరహా పాలన చేస్తున్న ఎంఎల్ఎకు ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపు అయిలయ్య యాదవ్, మాజీ కార్పొరేటర్లు గాదం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, అంజలి పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుల కేంద్రంలో పండ్లు, కిరాణం పంపిణీ

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జమాత్ ఎ ఇస్లామీ హింద్ పెద్దపల్లి యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లిలోని మానసిక వికలాంగుల కేంద్రంలో పండ్లు, కిరాణా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మహ్మద్ ప్రవక్త బోధనలకు నిదర్శనమని జమాత్ పట్టణ అధ్యక్షుడు ఎం.ఎ. మోహీద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త సమస్త మానవజాతికి కరుణగా పంపబడ్డారని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, ఇతరులకు సహాయం చేయడం ఉత్తమమైన పనులని ఆయన బోధించారని తెలిపారు. పొరుగువాడు ఆకలితో ఉండగా, తాను కడుపు నింపుకునేవాడు నిజమైన విశ్వాసి కాదు అనే ప్రవక్త వాక్యం స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. జమాత్ వాలంటీర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాబోయే రోజుల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలతో పాటు పేదల కోసం సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో సయ్యద్ మతీనుద్దీన్, అరీఫుద్దీన్, సయ్యద్ ఇమ్రాన్ సూఫీ, రహీమ్ అజీజీ, రౌఫ్ అజీజీ, ఎం.ఎ. వాహెద్, షేక్ అహ్మద్, జమీరుద్దీన్, మహ్మూద్ హుస్సేన్, మహ్మద్ జమీర్, సయ్యద్ ముజాఫరుద్దీన్, నౌషేద్ అలీ, సయ్యద్ హాషీర్, మునాబ్ అబ్రార్, జిమ్రాన్ మొహియుద్దీన్, సయ్యద్ ముజాయుద్దీన్ మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అంధకారంలో ఇంజినీరింగ్ కళాశాలల భవిష్యత్తు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఇంజినీరింగ్ కళాశాలల భవిష్యత్తు అంధకారంలో ఉందని, ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి ట్యూషన్ ఫీజులు రాకపోవడంతో కళాశాలల నిర్వహణకు యాజమాన్యాలు కోట్లలో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్య కారణంగా అనేక నెలలుగా అధ్యాపకులకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు వాపోయారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడం వల్ల గత నాలుగేళ్లలో రాష్ట్రంలో సుమారు 10 వృత్తి విద్యా కళాశాలలు మూతబడ్డాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ మరిన్ని కళాశాలలు మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థుల భవిష్యత్తు గల్లంతవుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణలో పాలకుల కుట్ర

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : ఎస్‌సి వర్గీకరణ అమలులో పాలకుల కుట్ర కారణంగా మాలలకు అన్యాయం జరుగుతోందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 18న ముఖ్యమంత్రి ఇచ్చిన జిఒ మాలలకు అన్యాయం చేసిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మాలలు వ్యతిరేకం కాదని, కేవలం సామాజిక న్యాయం జరగడం లేదనే తమ విమర్శ అని ఆయన స్పష్టం చేశారు. రోస్టర్ విధానం వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, శాతవాహన యూనివర్సిటీలో 33 గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీలో ఒక్క మాలకి ఉద్యోగం రాలేదని సుధాకర్ గుర్తుచేశారు. ఈ విధానం వల్ల మాలల భవిష్యత్తు నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోస్టర్ విధానం వల్ల మాలలు 22వ స్థానంలో ఉన్నారని, ప్రభుత్వం



వెంటనే దీనిపై చర్చించి సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం ప్రజలకు వివరించి పోరాటంలో భాగస్వాములను చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. నవంబర్ 26న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దెల నర్సయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, ఉపాధ్యక్షులు ఆశాది పురుషోత్తం, నాయకులు ఎలుక దేవయ్య, కట్టె కోల మధు, మాదాసి చందు తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ పెంచి అందించాలి

ప్రజాపక్షం / ధర్మపురి : రాష్ట్రంలోని వికలాంగులు, వృద్ధులు నేత, గీత, బీడి కార్మికుల చేయూత పెన్షన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన పింఛన్ పెంపు హామీని నిలబెట్టుకుని పెంచిన పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జగిత్యాల జిల్లా ధర్మపురి తహశీల్దార్ కార్యాలయం ముందు వికలాంగుల హక్కుల పోరాట సమితి(విహెచ్‌పిఎస్), మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పిఎస్) ఆధ్వర్యంలో పెన్షన్ దారులతో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షుడు చందోళి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పెన్షన్ దారులకు రెండు నుండి 4వేలు, వికలాంగు



లకు రూ.లు 4వేల నుండి 6వేలు పెంచి అందిస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి 21నెలలు గడుస్తున్నా పెంచకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ విహెచ్‌పి, ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో పెన్షన్ దారులతో తహశీల్దార్ కార్యాలయం ముందు ఒక రోజు నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందోళి శ్రీనివాస్, ప్రేమిత్, రాజమల్లయ్య, రవికుమార్, రాయనర్సు, మహేష్, గంగారాం, మల్లయ్య, పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఆసుపత్రిలో వలంటీర్ల సేవలు ప్రారంభం

ప్రజాపక్షం / పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు రద్దీ పెరగడంతో నిత్యం వచ్చే బాధితులకు సౌకర్యం అందించేందుకు యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం (4) నలుగురు వాలంటీర్లను



నియమించారని ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ రద్దీ ఎక్కువగా పెరగడంతో ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోగులకు వివిధ రకాల సేవలు అందించడానికి ట్రస్ట్ సభ్యులు, జిల్లా యాదవ మహాసభ సభ్యుల సహకారం అవసరం అని పేర్కొన్నారు. వీటి అనుమతి కోసం ట్రస్ట్ కోశాధికారి మేకల మల్లేశం యాదవ్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను సంప్రదించి, వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం జరిగిందని వెల్లడించారు. వాలంటీర్లు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సేవలందిస్తారని, త్వరలో రోగులకు టోకెన్ పద్ధతిలో 50 మందికి భోజనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే బాధితులకు సేవలందించేందుకు ముందుకు వచ్చిన యాదవ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో 210, ఈ నెలలో ఇప్పటికి 129 డెలివరీలు పూర్తయ్యాయని, త్వరలో సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ యంత్రాలను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని వెల్లడించారు. క్రమంగా, ట్రస్ట్ ద్వారా సేవలు అందించడంతో హాస్పిటల్ కు వచ్చే బాధితులకు వైద్య బృందం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ విజయ్ కుమార్, మేకల మల్లేశం యాదవ్, సందనవేణి రాజేందర్ యాదవ్, శిలారపు పర్వతాలు యాదవ్, కావేటి రాజగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నివాళులు

ప్రజాపక్షం / మల్లాపూర్ : నల్గొండ జిల్లా తుంగతుర్తి మండల పరిషత్ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ ఎలేటి సోమరెడ్డి అకాల మరణం చెందగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నివాళి అర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శశికుమార్, ఎంపివో జగదీష్, రాజేందర్, మహేష్, ప్రశాంత్, అనిల్, నాగమణి, వినోద్, ఏపివో సతీష్ ఉన్నారు.

## అన్నదాతకు ఆత్మీయ సత్కారం అవార్డు అందజేత

ప్రజాపక్షం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన యువరైతు బందారు వెంకటేష్ అన్నదాతకు ఆత్మీయ సత్కారం అవార్డు సోమవారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సిబిఐ మాజీ జెడి లక్ష్మి నారాయణ నిర్వాహకులు యూత్ హోఫ్ యాంటీ కరప్షన్ వారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతను పెంబట్ల గ్రామ ప్రజలు మాజీ ప్రజాప్రతినిధులు, మిత్రులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## వినతి పత్రం అందజేత

ప్రజాపక్షం/సారంగాపూర్:జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం మేడారం తండా నాయక్ గూడెం ప్రజలు సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకపు గూడెం నుండి గ్రామపంచాయతీ జగిత్యాల వెళ్లే దారి వర్షాకాలంలో దారుణ స్థితికి చేరుకుందని, ప్రయాణం కష్టంగా మారిందని ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులను కేటాయింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సురేందర్, మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి డిగ్రీ కళాశాలలో నల్ల బ్యాడ్జీల నిరసన

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్: విద్యార్థులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మూడేళ్లుగా నిలిచిపోవడంతో యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సోమవారం గాయత్రి డిగ్రీ అండ్ పిజి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సెప్టెంబర్ 14న ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో అన్ని డిగ్రీ, పిజి కళాశాలల్లో నిరవధిక బంద్ పాటిస్తామని జెఎసి నాయకులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాయత్రి కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో పెట్రోల్ డబ్బాలతో నిరసన

ప్రజాపక్షం/జగిత్యాల: తామకు న్యాయం చేయాలంటూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం కోనరావుపేట, కొండ్రికర్ల గ్రామానికి చెందిన గంగపుత్రులు ప్రజావాణిలో పెట్రోల్ డబ్బాలతో నిరసన తెలిపారు. ఇది గమనించిన పోలీస్ సిబ్బంది కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో వారిని అడ్డుకొని పెట్రోల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు.

## గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 12 మంది అర్జీదారులతో ఎస్పీ స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందపరుస్తు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆసిఫాబాద్ రెవెన్యూ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ప్రజలు ఎక్కువగా పింఛన్లు, ఉద్యోగాలు, పట్టా పాస్‌బుక్కులు, భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారుల సమన్వయంతో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.



# ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీవిద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ఆసిఫాబాద్ ఎంఎల్‌ఎ కోవ లక్ష్మి ఇంటి ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ఎంఎల్‌ఎకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం చట్టం ద్వారా ఐసిడిఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రమాదకర విధానాలను వ్యతిరేకించాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా రూ.18,000 వేతనం, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ జిఒ నెం. 8ను సవరించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, 24 రోజుల సమ్మె వేతనం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ నాయకులు ఉమాదేవి, వనిత, గంగమణి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ భారత ప్రభుత్వం హిందీని అధికార బాషగా గుర్తించినందున హిందీకి ఎంతో ప్రధాన్యత ఉందన్నారు. హిందీ నేర్చకోవడం ద్వారా దేశ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పొందడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే హిందీ విభాగ అధిపతి డి. జనార్ధన్ మాట్లాడుతూ హిందీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పలువురు విద్యార్థులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.డి. లక్ష్మినర్సింహం , అధ్యాపకులు ఇ.శారద, టి.దత్తాత్రేయ, జె. మహేష్, డి. సంతోష్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# రైతులకు సరిపడా ఎరువులు అందజేస్తాం

### మండల వ్యవసాయాధికారి రామకృష్ణ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్/దహెగాం :** రైతులకు ఇబ్బందులు లేకుండా సరిపడ ఎరువులు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలోనే ప్రతీ రైతుకి యూరియా అందజేస్తామని వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. దహెగాం మండలంలోని గిరివెల్లి రైతు వేదికలో 888, దహెగాం సొసైటిలో 888 బస్తాలు పంపిణి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సొసైటిని తీసుకురావడం జరిగిందని అన్నారు. గులికల రూపంలో ఉన్న యూరియాతో పాటు నానో యూరియా వైపు దృష్టి సారించాలని అన్నారు. త్వరలోనే ప్రతీ రైతుకు ఎరువులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ తిరుపతి గౌడ్, ఎఇఒలు, పోలీసు సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# షెల్టర్ నిర్మాణాలు పూర్తిచేయాలి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** షెల్టర్ నిర్మాణాలు పూర్తి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాజంగుల రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల ఉట్నూర్, ఇచ్చోడ అడ్డాల వద్ద షెల్టర్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్మిక శాఖలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పి నాగోరావు, కార్యదర్శి టి మహేందర్‌లు పాల్గొన్నారు.

# రెబ్బెన ఎస్‌ఐ వెంకటకృష్ణకు కాంగ్రెస్ నేతల సన్మానం

**ప్రజాపక్షం/రెబ్బెన :** తాజాగా బదిలీపై రెబ్బెనకు వచ్చిన ఎస్‌ఐ ఎ.వెంకటకృష్ణను కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, స్థానిక నాయకులు నేరాల నిర్మూలకు సహకరించాలని, సిసి కెమెరాల ఏర్పాటులో భాగస్వామ్యం అవ్వాలని కోరారు. మండల అధ్యక్షులు, కుమురంభీం జిల్లా ఆర్‌టిఎ మెంబర్ లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం దేవాజీ, డాక్టర్ మల్లయ్య, సుబ్బారావు, శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం డైరెక్టర్ దుర్గం అన్నాజీ, యువ నాయకులు సోనాలే సంతోష్ బాబు, చల్లూరి బాపు, దుర్గం సురేష్ ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# బిసిల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు నడవాలి

**ప్రజాపక్షం / చెన్నూరు :** బిసిల రాజ్యాధికారమే ధ్యేయంగా బహుజనులంతా ఏకమై ముందుకు సాగాలని బిసి పొలిటికల్ జెఎసి మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి మహేష్ వర్మ పిలుపునిచ్చారు. ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న నాయకత్వంలో ఏర్పాటు కానున్న కొత్త పార్టీ ప్రకటన ఈ నెల 17న హైదరాబాద్‌లో జరుగుతుందని ఆయన తెలిపారు. సోమవారం చెన్నూరు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహేష్ వర్మ మాట్లాడుతూ బిసిల ఆత్మగౌరవాన్ని కాపాడాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న సొంత పార్టీని ఏర్పాటు చేస్తున్నారని, బహుజనులు పరాయి పార్టీ జెండాలను పక్కన పెట్టి ఏకం కావాలని కోరారు. ఈ నెల 17న జరిగే పార్టీ ప్రకటన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం చెన్నూరు మండల అధ్యక్షుడు సాట్లపల్లి శ్రీధర్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.







# హిందీ భాషకు ప్రత్యేక స్థానం

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ :** విశ్వ భాషలలో హిందికు ప్రత్యేక స్థానం ఉందని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శివకృష్ణ అన్నారు. సోమవారం కళాశాలలో హింది దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిప్ డా. ఎం. శివకృష్ణ మాట్లాడుతూ హింది మన జాతీయ భాషయే కాకుండా శాశన భాషగా గుర్తింపు ఉందని, విశ్వ భాషలలో 13వ స్థానంలో ఉందని అన్నారు. హింది భాష ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో హింది విభాగ అధ్యక్షులు పి. లక్ష్మీ ప్రసన్న, సహా అధ్యాపకులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న ప్రభుత్వం

### ఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్



**ప్రజాపక్షం/లక్షెటిపేట :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం లక్షెటిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థులను, కాలేజీ మేనేజ్‌మెంట్‌లను ఇబ్బందులకు గురి చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కెసిఆర్ చెక్కులు ఇచ్చి నిలిపేస్తే, నేడు సిఎం రేవంత్ రెడ్డి టోకెన్లు ఇచ్చి పైసలు ఇవ్వడంలేదని ఎద్దేవా చేశారు. మూసి రివర్ ఫ్రంట్, ఫోర్త్ సిటీ, అందాల పోటీలకు లక్షల కోట్లు ఖర్చు చేయగలిగే ప్రభుత్వం, పేద విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడానికి పైసలు లేవా అని ప్రశ్నించారు. గురుకులాలు గాలికొదిలి, సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రభుత్వ పాఠశాలలను అధోగతికి నెడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చేప్తామని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో మరోసారి విద్యార్థి ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులపై నిజమైన ప్రేమ ఉంటే వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి నిబద్ధతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తల్లి పేరుతో మొక్కలు నాటడం అభినందనీయం

**ప్రజాపక్షం / పెంచికల్ పేట్ :** ఒక మొక్క అమ్మ పేరుతో (ఏక్ పేడ్ మా కె నామ్) కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లుల పేరుతో మొక్కలు నాటడం అభినందనీయమని పెంచికల్‌పేట్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్దంపూడి ఆల్బర్ట్ అన్నారు. సోమవారం మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏక్ పేడ్ మా కె నామ్ ప్రచారాన్ని ప్రారంభించారని, దీని లక్ష్యం దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేసి మొక్కలు నాటడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమేష్ బాబు, ఎపిఒ సతీష్, పంచాయతీ కార్యదర్శి జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.



# పింఛన్‌దారుల హామీలను నెరవేర్చాలి

## ఎంఆర్‌పిఎస్

**ప్రజాపక్షం/కాసిపేట :** ప్రభుత్వం ఎన్నికల ముందు చేయూత పింఛన్ దారులకు పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, అర్హులైన వారిని గుర్తించి వారికి వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని ఎంఆర్‌పిఎస్ మండల కన్వీనర్ గొడిశెల క్రాంతి డిమాండ్ చేశారు. సోమవారం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పద్మశ్రీ మంద క్రిష్ణ మాదిగ పిలుపు మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేసి తహసీల్దార్ సునీల్ కుమార్‌కు పింఛన్లు పెంపు, అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్లతో మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల నాయకులు పోలగాని తిరుపతి, గొర్రెపెల్లి మల్లేష్, దాసరి వినయ్, నగురారపు సుమన్, ఎంఆర్‌పిఎస్ మండల కో కన్వీనర్ గోడిసెల క్రాంతి, కో కన్వీనర్ కాంపెల్లి వెంకటేష్ మాదిగ, సీనియర్ నాయకులు లంక లక్ష్మణ్ మాదిగ, దాసరి శంకర్ మాదిగ, గోడిసెల బుగ్గరాజు మాదిగ, ముత్యంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు గొడిశెల కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గొడిశెల అరుణ్ కుమార్ మాదిగ, అజయ్ కుమార్ మాదిగ, కోశాధికారి గొడిశెల కళ్యాణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# ఆహారమెనూ పాటించకపోవడపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో శాంతినగర్ గల మహాత్మ జ్యోతిబాపూలే బాలురు పాఠశాలలో విద్యార్థులకు ఆహారమెనూ సరిగా పాటించడం లేదని సంబంధిత అధికారులు,సిబ్బందిపై ఎమ్మెల్యే వెడ్మాబొజ్జు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం ఉదయం ఎంజెపి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం కిచిడి, టమాటా కూర పెట్టాల్సి ఉండగా పప్పు,అన్నం పెట్టడం జరిగింది. దీనిపై ఆరా తీసి అధికారులు, ఉపాధ్యాయులను ప్రశ్నించారు.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా, స్థానిక అధికారుల నిర్లక్ష్యం లేకుండా దృష్టి సారించాలని పిల్లలకి మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన సరుకులను పరిశీలించారు.అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు తోట సత్యం, దయానంద్, చిన్నం సత్యం, నిమ్మల రమేష్, సత్యనారాయణ,రాజేశ్వర్,గంగా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే పర్మనెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం నాలుగో రోజు జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గత ముప్పై సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తూ తీవ్ర కష్టాలు పడుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, నిలిపివేసిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 212 జిఒను సవరించి 2014లో ఐదు సంవత్సరాల సేవ పూర్తి చేసిన వారందరినీ పర్మనెంట్ చేయాలని, మిగతావారికి టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, జెఎసి నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో భవిష్యత్తు నిర్మించుకోవాలి

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గ పెంబి,కడెం మండలలాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,మండల కేంద్రం లోని ఎంపిపిఎస్ పాఠశాలలో భవిత సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేసి, పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలకు హాజరు కావాలన్నారు.ఉపాధ్యాయులు,పిల్లలకు చక్కని విద్యను అందించాలని అన్నారు.పాఠశాలలోనే విద్యార్థులకు బెల్ట్స్,టైలు అందచేశారు.అనంతరం బిల్లా టైగెర్స్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో వెడ్మ బొజ్జు లోగోను కలిగి ఉన్న టీషర్ట్ ఆవిష్కరించారు.అదేవింధంగా గుమ్మన్ ఎంగ్లాపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలపై అర్జీలు ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వర్షాలతో కొట్టుకుపోయిన వంతెన ప్రాంతంలో ఐరన్ వంతెన నిర్మాణానికి సంభందించినవీ అన్ని పనులు పూర్తి చేశామని,దానినీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం కడెం మండలంలోని ఏపీపీఎస్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్,స్వప్నిల్,స్వామి,ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(ఎస్.ఐ.ఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ 2002 పై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.ఓటర్ జాబితాలో డూప్లికేట్ ఓట్లు,నకిలీ ఓట్ల తొలగింపు కు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(ఎస్.ఐ.ఆర్) చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో చివరగా 2002లో ఎస్ఐఆర్ చేయడ జరిగిందని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్ఓ, డిప్యూటీ తహసిల్దారులు,బిఎల్ఓ, పర్యవేక్షకులు తగినంత మంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి పాల్గొన్నారు.

# పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ కొమరం భీమ్ చౌరస్తాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లో అనేక అవినీతి,అక్రమాలు జరిగిందని వెంటనే సమస్య పరిష్కారం చేయాలని సిపిఐ(ఎంఎల్ )న్యూడెమోక్రసీ బహుజన కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టర్ కార్యాలయం సోమవారం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగింది అని తెలిపారు.ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్,బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్నలు మాట్లాడుతూ ఖానాపూర్ కొమురం భీం చౌరస్తాలో గత ప్రభుత్వంలో నిర్మించిన టువంటి డబుల్ బెడ్రూంలో అవినీతి అక్రమాలు జరిగింది.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని,డబుల్ బెడ్ రూమ్ లో పేదల కోసం కేటాయించిన వాటిని పేదలకు ఇవ్వకుండా,ధనవంతులకు కేటాయించడంలో అంతరమేమిటి.అనేకసార్లు కలెక్టర్ కి సంబంధిత అధికార యంత్రాంగా దృష్టి కి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీలిస్తూ,అమలు చేయడంలో విఫలమయ్యారు.వెంటనే సమస్యను పరిష్కరించాలని అదేవిధంగా అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న,డబల్ బెడ్ రూమ్ సాధన కమిటి కన్వీనర్లు,తోట రాధా, గౌస్, మజీద్‌ఖాన్,సయ్యద్ షాదుల్లా, ఆత్రం కమల, లక్ష్మి ,తాళ్ల రుక్మ పాల్గొన్నారు.



# దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌కు శిశుమందిర్ విద్యార్థులు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు దక్షిణ భారత సైన్స్ ఫేర్‌కు ఎంపికయ్యారని సోమవారం పాఠశాల ప్రధానాచార్యుడు గుండేటి కోటేశ్వరరావు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కామారెడ్డి పట్టణంలో ఈ నెల 12, 13, 14 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాలో తమ పాఠశాలకు చెందిన కల్లూరి చరణ్, సాకేత్, హరిచరణ్, వెంకటరత్న సంస్కృతి బోధ పరియోజన అంశంలో పాల్గొని ఈ పోటీలకు అర్హత సాధించారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 18, 19, 20 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. దక్షిణ భారత సైన్స్ షేర్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



# పోషణ్..బి, పడాయి బిపై అవగాహన

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం రోజున ఐసిడిసిపి ఆధ్వర్యంలో ఖానాపూర్, కడెం, పెంబి మండలాల అంగన్వాడీ టీచర్లకు పోషన్ బి,పడాయి బి కార్యక్రమంపై సిడిపిఓ శ్రీలత టీచర్లకు అవగాహన కల్పించారు.అంగన్వాడీలో చిన్నారులకు విద్యతో పాటు పోషణ అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని,దీనిని పటిష్టంగా నిర్వహించాలని,చిన్నారుల మానసిక ఎదుగుదలకు శరీరక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని,అందన్వాడీ టచర్లకు తెలియజేశారు.ప్రతి ఒక్క అంగన్వాడీ సెంటర్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లల మానసిక,శరీరక ఎదుగుదలకు కావలసిన విషయాలను తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శ్యామల,రజిని తదితరులు ఉన్నారు.

# నూతన పింఛన్లు అమలు చేయాలని ఎమ్మార్వోకు వినతి

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** వికలాంగులు,పెన్షన్ దారులు ప్రజల పక్షాన ఎమ్మార్వో భోజన్న కు వినతి పత్రం అందజేశారు.కల్లెడ సాయి మాదిగ నిర్మల్ జిల్లా అధికార ప్రతినిధి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోని వస్తే వికలాంగుల పెన్షన్ రూ.4000 నుండి రూ.6000/ పెంచుతామని,అలాగే వృద్ధులు,వితతంతువులతో పాటు ఇతర పెన్షన్ దారుల పెన్షన్లు రూ.2000 నుండి రూ.4000/ పెంచుతామని హామీ ఇచ్చారు.ఎన్నికల మేనిఫెస్టోలో కూడా వాగ్దానం చేశారు.కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవీ చేపట్టి 22 నెలలు గడిచినా ఇచ్చిన మాట ప్రకాం పెన్షన్లు పెంచలేదు.ఇది ఘోరమైన మోసం,వారి పట్ల చాలా చిన్న చూపు చూస్తున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వికలాంగుల పెన్షన్ రూ.6000అలాగే వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు నేత గీత బీడి కార్మికులతో పాటు ఇతర చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ.4000 పెంచాలని,నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలని గౌరవ తాసిల్దార్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు పోత రాజు లక్ష్మణ్ ఎం.ఎస్.పి శంకర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రాకేష్, ఉన్నారు.

# పెండింగ్ పీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలి

## ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు రఘురాం అన్నారు. సోమవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో ఎన్‌టిఆర్ చౌరస్తాలో పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు. ఇంజనీరింగ్, పి.జి, డిగ్రీ, బిఇడి, ఎంబిఎ విద్యాసంస్థల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణమద్దతు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి 8 వేల కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్తులకు ఉపయోగపడాలని ఉద్దేశంతో డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో తీసుకువచ్చిన ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా సహాయ కార్యదర్శి కుషాల్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబోద్, నాయకులు రమేష్, దినేష్, అంజి విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు శిక్షణ

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శ్రీలత ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలోని ఖానాపూర్,మామడ,పెంబి మండలాల అంగన్వాడీ టీచర్లకు సోమవారం పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో పోషణ్ భీ,పడాయి భీ కార్యక్రమం పట్ల శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా శిక్షణ తరగతుల పట్ల సీడీపీవో మాట్లాడుతూ శిక్షణ తరగతులను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలను పౌష్టికాహారం అందించే కేంద్రాలుగానే కాకుండా అభ్యాస కేంద్రాలుగా మార్చడం పోషణ్ భీ,పడాయి భీ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.దీని వల్ల చిన్నారులకు పోషకాహారంతో పాటు ప్రారంభంలోనే బాల్య సంరక్షణ,విద్య పట్ల అంగన్వాడీలు దృష్టి సారిస్తాయని పేర్కొన్నారు.చిన్నారుల్లో మానసిక,శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు, శ్యామల, రజిని,ఆయా మండలాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రెంజల్‌లో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/ఎడపల్లి :** మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రెంజల్ మండలంలో సోమవారం ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. వికలాంగులకు, వృద్దులకు చేయూత పెన్షన్లు పెంచాలని, బీడీ కార్మికులకు కొత్త పెన్షన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ తమ నిరసన తెలియచేశారు. అనంతరం తహసీల్దార్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు బండారి పోశెట్టి, కిన్నెర మోహన్, రవి, సాయిలు, గంగాధర్, వికలాంగుల నాయకుడు సాకిని గంగాధర్, సావన్ రాజు పాల్గొన్నారు.




# వికలాంగుల పింఛను రూ.6000 పెంచాలి

## బైంసా మండల తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన వికాలాంగులు



**ప్రజాపక్షం/బైంసా :** వికలాంగుల పింఛను రూ.6000 పెంచాలి.వృద్దులు వితంతువులు ఒంటరి మహిళలు నేత,గీత,బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారులకు రూ,4000 పెన్షన్ పెంచాలి.ఇప్పటికే నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలి.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ రూ,4000 నుండి రూ.6000 పెంచుతామని,అలాగే వృద్ధులు వితంతువులు,బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారుల పెన్షన్లు రూ,2000 నుండి రూ.4000/ పెంచుతామని హామీ ఇచ్చారు.ఎన్నికల మేనిఫెస్టోలో కూడా వాగ్దానం చేశారు.కానీ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవీ చేపట్టి 22 నెలలు గడిచినా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచలేదు.ఇది ఘోరమైన మోసం,అంగవైకల్యం,నిస్సహాయ స్థితి,నిరాదరణ వల్ల ఇప్పటికే ఎన్నో అవమానాలు,అవహేళనలు ఎదుర్కొంటున్న వికలాంగులు,వృద్దులు,వితంతువులతో పాటు ఇతర పెన్షన్ దారుల యొక్క దీన పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతున్నాం.పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి,సరైన

# ప్రజాపాలన దినోత్సవ వేడుకకు విస్తృత ఏర్పాట్లు : కలెకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో నిర్వహించనున్న ఈ వేడుకలను పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్యఅతిథితో పాటు ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బంధీ ఏర్పాటుల చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షించాలన్నారు. వేదిక, సిటింగ్ ఏర్పాట్లు, తదితర వాటిపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, ఆర్డీఓ రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఎఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

## బిజెపి సేవాపక్షం కార్యశాల



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆరే రవీందర అధ్యక్షతన సేవా పక్షం కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జి నోముల నర్సారెడ్డి హాజరై ప్రధాని మోడీ పుట్టిన రోజు సందర్భంగా 17 నుండి అక్టోబర్ 2 వరకు 15 రోజుల పాటు సేవా పక్షంగా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. 17న రక్తదాన శిబిరం ఏర్పాటు 18న స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాలని 25న దీన్ దయాల్‌జీకి నివాళులర్పించి మొక్కలు నాటాలని 28న విశిష్ట వ్యక్తులకు సన్మానం అక్టోబర్ 2న గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రీల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తూ స్వదేశీ ఖాదీ వస్త్రాల కొనుగోలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, మోహన్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రజనీకాంత్, లింబాద్రినాయక్, లింగం, దినేష్, గంగాధర్ గౌడ్, రాజేశ్వర్, శ్రీనివాస్, సుజిత్‌రెడ్డి, లక్ష్మణ్, అశోక్, ప్రకాష్‌నాయక్, సుదర్శన్, రమేష్, లింబాద్రినాయక్, లింబన్న, ప్రభాకర్, సురేష్‌నాయక్, పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట వికలాంగుల నిరసన

**ప్రజాపక్షం/మాక్లూర్ :** సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో వికలాంగులకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని హామీనిచ్చారని ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ పెంచాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వికలాంగులు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి అధ్యక్షులు సరికెల పోశెట్టి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు, వృద్ధులకు ఎన్నికల్లో 6 వేల పెన్షన్ ఇస్తామని హామీనిచ్చారన్నారు. కానీ ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చటం లేదని తీవ్రంగా మండిపడ్డారు. కావున సిఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు 6 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెయిలర్ మధుసూదన్, చిరంజీవులు, భాస్కర్, ఉల్లెంగ లక్ష్మణ్, రవీందర్, ఒడ్డెన్న, నాయకులు, వికలాంగులు, వృద్ధులు పాల్గొన్నారు.



## నందిపేట్‌లో కుక్కలు బాబోయ్ బాబోయి కుక్కలు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో కుక్కలు బాబోయి కుక్కలు అంటు గ్రామ ప్రజలు పారిపోతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కుక్కల బెడద, దాడుల వల్ల జనాలు ఇంటి నుండి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇటీవలే కుక్కల దాడి వల్ల ఒకరు చనిపోయారు. కొందరు ఆసుపత్రి పాలయ్యారు. అయినా అధికారులలో చలనం కనిపించడం లేదు. గుంపులు, గుంపులుగా కుక్కలు గ్రామంలో స్వైర విహారం చేస్తున్నాయి. వీటిని చూసి పెద్దలు, పిల్లలు భయపడుతున్నారు. స్కూల్ పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. గ్రామంలోనే మటన్, చికెన్, చేపల దుకాణాలు స్థానిక బస్టాండ్ సమీపంలో, స్కూల్ పరిసరాలలో, రోడ్డుపక్కన ఉండడం కూడా కుక్కలు పెరగడానికి కారణం కావచ్చు. గత సంవత్సరం గ్రామాభివృద్ధి కమిటి, గ్రామ పంచాయతీ అదికారులు ముందుకు వచ్చి కొంత వరకు కుక్కల బెడద అరికట్టారు. ఈ విషయంలో గ్రామంలోని యువకులు మండల అభివృద్ధి అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ఎందరో ఆసుపత్రి పాలవుతున్నారు.

## పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా రమేస్ జాన్

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండల పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి పాస్టర్స్ భవన్‌లో జరిగింది. నూతన అధ్యక్షునిగా బ్రదర్ రమేష్ జాన్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ దినకరన్ రాజ్‌పాల్, కోశాధికారిగా పాస్టర్ మధులు ఎన్నికైనారు. కాగా అధ్యక్షులు రమేష్ జాన్‌ను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కార్యదర్శి ట్రెజరర్లను ఎ న్నుకున్నామన్నారు. ఎలక్షన్ కమిటీ నిర్వాహకులుగా సునీల్, ప్రభుదాస్, దైవచిత్తం, ఇమ్మానుయ్యేల్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రమేష్ జాన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో క్రైస్తవ సార్వత్రిక సంఘ క్షేమం కోసం పాటుపడుతామన్నారు. తాను ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ మండల సంఘ కాపర్లు నాయకులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టియులో ధర్నా

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం టియు ఇంజనీరింగ్ బిల్డింగ్ ఎదుట విద్యార్థులతో ధర్నా నిర్వహించామన్నారు. ఈసందర్భంగా టియు వర్సిటీ కన్వీనర్ సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు వెంటనే ఫీజు రిఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్ట్రైక్ నిర్వహించామన్నారు. వేలాది మంది విద్యార్థులు తరగతులను బహిష్కరించి ప్రభుత్వం నిర్లక్ష్యంపై తమ కోపాన్ని వ్యక్తం చేస్తూ నిరసనలో పాల్గొన్నారు. ఫీజు రిఎంబర్స్‌మెంట్‌లో ఆలస్యం విద్యార్థులకు ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తీవ్రమైన ఆర్థిక సమస్యలను సృష్టించిందని ఎఐఎస్ఎఫ్ నేతలు తెలిపారు.కార్యక్రమాల్లో కోకన్వీనర్ చందు, యూనివర్సిటీ ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రసాద్, అజయ్, రహిత, భార్గవి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 115 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 115 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోఇన్ చింగ్తియాన్ మావీ, డీఆర్‌డీఓ సాయగౌడ్, నగరపాలక సంస్థ కమీసనర్ దిలీప్‌కుమార్, మెప్మా పీడీ రాజేందర్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 11,9 3 ,0 00 విలువైనసిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎం సహాయ నిధి ఒక వరప్రసాదమన్నారు. చికిత్సఖర్చులభారాన్నితగ్గించినందుకు ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అధికారు లు,లబ్ధిదారులకుటుంబసభ్యులుపాల్గొన్నారు.

## పంచాయతీ బిల్డింగ్ నిర్మాణ స్థల పరిశీలన

**ప్రజాపక్షం/వాజేడు:**వాజేడు మండల పరిధిలోని పేరూరు పంచాయతీ నూతన బిల్లింగ్ నిర్మాణ స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత వర్మ, ఎంపీడీవో శ్రీకాంత్ సోమవారం పరిశీలించారు. అదే విధంగా వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ములుగు జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లగాసి రమేష్,ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మయ్య పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## జాతీయస్థాయి చెస్ పోటీలకు తెల్లం రాజ్యలక్ష్మి ఎంపిక

**ప్రజాపక్షం/వాజేడు:**జాతీయ స్థాయి చెస్ పోటీలకు వాజేడు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఎంప్లాయిస్ రాష్ట్రస్థాయి హైదరాబాదులో జరిగిన చెస్ చాంపియన్ షిప్ పోటీలో రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యా రు. ములుగు జిల్లా నుంచి ఆదివాసి ఉ ద్యోగ జాతీయ స్థాయికి ఎంపిక అవ్వ డం పట్ల మండల స్థాయి అధికారులు జి ల్లా ప రి షత్ ఉన్నత పాఠశాల సిబ్బంది ఆమెను అభినందించారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/వాజేడు:**గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వాజేడు మండలంలో చోటుచేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో స్కై విజన్ కేబుల్ లో పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజోలు గ్రామం నుండి సోలభైన సత్తిబాబు (45) తో పాటు 8 మంది కార్మికులు వచ్చారు. సోమవారం స్కై విజన్ కేబుల్ వైర్ లాగుతుండగా నీరసానికి గురై మంచినీళ్లు తాగడంతో సత్తిబాబు కిందపడిపోయాడు. ఇది గమనించిన తోటి కార్మికులు ఆపస్మరక స్థితిలో ఉన్న సత్తిబాబును హుటాహుటిన వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ మధుకర్ పరీక్షించి అప్పటికే సత్తిబాబు గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

# కెయులో ఘనంగా ఇంజనీర్స్‌డే వేడుకలు




**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** మహిళా ఇంజనీరింగ్ కాలేజ్ కాకతీయ యూనివర్సిటీ సెమినారాల్లో ఇంజనీర్స్ డే వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె బిక్షాలు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఓ కిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం పురస్కరించుకొని జాతీయ ఇంజనీర్స్ డే జరుపుకుంటామని, ఇందులో భాగంగా కళాశాల విద్యార్థినిలు ప్రతీ ఇంజనీరింగ్ విభాగం ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయని, ఏ గ్రూపులో చదివిన అవకాశాలు అందిపుచ్చుకొని సమాజంలో ముందు వరుసలో ఉండాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఆర్థిక స్వాతంత్రం ఉండాలంటే కచ్చితంగా ఉన్నత స్థానంలో ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య యొక్క చేసిన సేవలు ఈ దేశానికి మన రాష్ట్రానికి ఎంతో గర్వకారణం అని తెలియజేశారు. ఈ కార్యక్రమం అనంతరం కళాశాల నుండి ఇ.ఇ.ఇ విభాగంలో 2021 బ్యాచ్ విద్యార్థిని అనూషను సన్మానించారు. అనూష గారు 2025 లో ఉద్యోగం సంపాదించి అసిస్టెంట్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ విభాగంలో యాదాద్రి పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, ఈ ప్రోగ్రాం కన్వీనర్ తూర్పాటి వెంకటేష్, కళాశాల అధ్యాపకులు సాయి తరుణ్, శ్రీనివాస్, కిరణ్ కుమార్ ,వాణిశ్రీ, యశస్విని ,వైష్ణవి, దీప్తి, రచన జోష్ణ అనూష, కళాశాల సూపర్డెంట్ బానోతు వీరు నాయక్, కళాశాల విద్యార్థులు దాదాపు 200 మంది పాల్గొన్నారు.

# కోతుల బెడద నుండి ప్రజలను కాపాడాలి

### సిపిఎం డిమాండ్




**ప్రజాపక్షం/వాజేడు:**కోతుల బెడద నుండి మండల ప్రజలను, పంట పొలాలను కాపాడాలని కోరుతూ సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వాజేడు మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మండల అభివృద్ధి అధికారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి మాట్లాడుతూ, మండల ప్రజలు గత కొంతకాలంగా కోతుల బారి నుండి తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని,కోతుల ఇళ్లలోకి దూరి ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయని, ప్రజలపై దాడికి పాల్పడుతూ వారి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, కోతుల నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మండల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు గురవుతారని, అందువలన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని, చట్టం తీసుకురావాలని, ఫారెస్ట్, గ్రామపంచాయతీ శాఖల ఆధ్వర్యంలో కోతులను పట్టుకొని అడవులలో వదిలేయాలని కోరుతూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దామోదర్, బచ్చల కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కడియం శ్రీహరికి క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘణపూర్ శాసనసభ్యులు, కడియం శ్రీహరిని విమర్శించినట్లు మాట్లాడితే, కార్యకర్తల నుండి వచ్చే పరిణామాలకు రాజయ్య నువ్వు తట్టుకోలేవని, మాజీ జెడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, (కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి కీసర దిలీప్ రెడ్డి) స్టేషన్గన్పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రం లోని, పాత చెరువు మత్తడి పోస్తున్న సందర్భంగా, స్టేషన్ ఘణపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ నాయకులు, చెరువులో, కుంకుమ పసుపు పుష్ప అలంకారాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కొల్లూరి శివకుమార్ (నర్సింహులు) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయగా, ఈ కార్యక్రమానికి, మాజీ జెడ్పిటిసి, గుడి వంశీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి కీసర దిలీప్ రెడ్డి మాట్లాడుతూ, స్టేషన్ ఘణపూర్ నియోజకవర్గంలోని, గోదావరి జలాలతో, చెరువులు నింపుకున్నామని, నియోజకవర్గ అభివృద్ధి పాదాత కడియం శ్రీహరికి, రైతాంగం రుణపడి ఉంటుందని వారు తెలిపారు. నియోజకవర్గాన్ని పట్టించుకోని రాజయ్య, బూటకం మాటలు మాట్లాడి, నేనే శభాష్ అని అనిపించుకుంటున్నాడు. అధికారంలో ఉండి, ఏ రోజు కూడా చెరువు ముఖం చూసినా పాపాన పోయావా రాజయ్య, ఇప్పుడు కడియం శ్రీహరి ఆధ్వర్యంలో, ప్రతి ఒక్క చెరువు నింపి రైతుల గుండెల్లో, మహనీయుడుగా నిలిచాడని వారు అన్నారు. కడియం శ్రీహరిపై, తప్పుడు మాటలు మాట్లాడితే, కడియం శ్రీహరికి, క్షమాపణ చెప్పాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడికల్ చైర్మన్ మూర్తి, జనగామ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లు, నీలం మోహన్, బు ట్రే రెడ్డి శ్రీలత రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్, వేముల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, దేవరాయ రాజు బూడిద సదానందం, గ్రామ శాఖ అధ్యక్షులు, రాజా రవీందర్ రెడ్డి, కళ్లెం పిఎస్ఏ చైర్మన్ ఉపేందర్, మాజీ సర్పంచులు, కే మెడీ సాయి మల్లయ్య, చౌదర్‌పల్లి విజయభాస్కర్, వైస్ ఎంపీపీ, గవ్వల మల్లేశం మాజీ ఎంపిటిసి, కే మిడి బిక్షపతి కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు, నర్సింగ రమేష్, గండి శీను, గండి దశరథ, ఎండి అఫ్జల్, దూసరి సోమ నర్సయ్య, పడిదే కిషన్, జనగాం ఉపేందర్, కాటం కుమారస్వామి, పడిదే కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# రాజయ్య తప్పుడు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** స్టేషన్‌ఘనపూర్ ఎమ్మె ల్యే కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పకపోతే డాక్టర్ రాజయ్యను గ్రామాలలో తిరగనిచ్చే ప్రసక్తే లేదని మండల మాజీ దళిత ప్రజా ప్రతినిధులు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో మాజీ దళిత ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు పిండ ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రడపాక సుదర్శన్, ఇల్లందల శ్రీనివాస్, ప్రభాకర్, ఎడ్ల వెంకటస్వామి, నర్సింగం, అశోక్, డానియల్ మాట్లాడుతూ రాజయ్య తనకు ఇష్టం వచ్చినట్లు కడియం శ్రీహరిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గతంలో కాంగ్రెస్ నుండి గెలుపొందిన నువ్వు ఆనాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డికి అమ్ముడుపోయి కోట్లు తీసుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో చేస్తున్న రూ.1వేయి కోట్ల అభివృద్ధి పనులు చూసి ప్రజలు సంతోషపడుతుంటే ఓర్వలేని నువ్వు (రాజయ్య) ఎమ్మెల్యేగా ఉన్నపుడు చేయకపోగా తన ఉనికి పోతుందని భయపడుతూ అనుచిత వ్యాఖ్యలు చేస్తే నిన్ను గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు నిన్ను గ్రామాలలో రానివ్వరన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు బిక్షపతి, రాజు, నాయకులు రాజేష్ నాయక్, మోహన్‌రావు, కృష్ణమూర్తి, రాజేందర్, మొగిలి, మార్కెట్ డైరెక్టర్ బాబు, సురేష్, రాజు, సారంగం పాల్గొన్నారు.



## వృద్ధురాలు ఆత్మహత్య

**ప్రజాపక్షం/నూగురు వెంకటాపురం:**వెంకటాపురం మండలంలోని నేలారిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కడుపు నొప్పితో బాధపడుతున్న సంగం సమ్మక్క (60) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన సమచారం మేరకు గత రెండు నెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుంది. ఇటీవల మందులు వాడుతున్నప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో వృద్ధాప్యంలో తన కుటుంబానికి భారం అవుతున్నానని ఆమె బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెపుతుడేది అని అదే క్రమంలో ఆదివారం రాత్రి పూట బాగా కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం సమ్మక్క కనిపించక పోవడం తో బావి వద్ద చెప్పులు, కర్ర చూడడంతో వెళ్లి చూడగా మృత దేహం కనిపించింది. కుమారుడు బుచ్చన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** కడియం శ్రీహరి బిఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేగా గెలుపొంది బిఆర్ఎస్ నాయకులను, ప్రజలను మోసం చేసిన కడియం శ్రీహరికి జఫర్‌గడ్ పట్టణ సెంటర్లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పిండ ప్రధానాలు చేసే కార్యక్రమంలో పోలీసులు బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కడియం శ్రీహరి నీకు రాజీనామా చేసే దైర్యం లేక పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నావంటూ మండిపడ్డారు.ఈ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిసి కో ఆర్డినేటర్ కొత్వాల కుమార్, మాజీ కో ఆప్షన్ మెంబర్ నజీర్, రైతు మాజీ కో ఆర్డినేటర్ శంకర్, మార్కెట్ మజీ డైరక్టర్ రాజ్‌కుమార్, నాయకులు శ్రీధర్, రమేష్, కృష్ణ, యాకనాథం, రవి, తదితరులు పాల్గొన్నారు.

## కడియం శ్రీహరి బేషరతుగా రాజీనామా చేయాలి



**ప్రజాపక్షం/రఘునాథ-పల్లి:** ఒక్కసారి, చివరి సారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వండి అంటూ కేసీఆర్‌ను నమ్మబలికి బిఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా పోటీ చేస్తే, కేసీఆర్ వెన్నంటి ఉండే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి శ్రీహరి సిగ్గు శరం ఉంటే బేషరతుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని జనగామ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కుర్చపల్లి గ్రామం నుండి రైతులకు సాగు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేపట్టిన పాదయాత్రకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ తూర్పు తాజా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్, వరంగల్ పశ్చిమ తాజా మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ సంఘీభావం తెలిపారు. రాజయ్య చేపట్టిన పాదయాత్ర కుర్చపల్లి నుండి గోవర్ధనగిరి మీదుగా కోమల్ల గ్రామం వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా, కారు గుర్తుపై గెలిచిన కడియం, బీఆర్ఎస్ పార్టీ తరుపున రాజయ్య చేపట్టిన పాదయాత్రను అడ్డుకుంటావా ఖబర్దార్ కడియం శ్రీహరి అంటూ ఆయన హెచ్చరించారు. కడియం నీకు దమ్ము, దైర్యం ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రా అంటూ సవాల్ చే శారు. కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ చేవెల్లి సంపత్, జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, మ ండల ఇన్‌చార్జి వై కుమార్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నా రు.